పెద్ద చెరువు ఎడమ కాలువ పునరుద్ధరణ



పనులు పరిశీలిస్తున్న డీఈ రవీందర్

ముస్తాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ పెద్ద చెరువు ఎడమ కాలువ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు ఇరిగేషన్ డీఈ రవీందర్ తెలిపారు. సోమవారం కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ రవీందర్ మాట్లాడుతూ రోడ్డు వెడల్పు చేస్తున్న క్రమంలో కాలువ మూసుకుపోయిందని దానికి పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే పెద్ద చెరువు తూం నుంచి నీరు లీకేజీ అవుతూ కిందికి వృథాగా పోతోందని దాని మరమ్మతు పనులకు అధికారులకు నివేదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్, వంశీకృష్ణ తదితరులున్నారు.

పోషకాహార వారోత్సవాలు

ముస్తాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దికుంట అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పోషక విలువలతో కూడిన ఆహారంపై అవగాహన కల్పించారు. తల్లిపాలే ఆరోగ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరవింద పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



అక్రమాలపై నిఘా..

● కేసులు నమోదు.. వాహనాలు సీజ్
● రూ 3.89 లక్షల జరిమానా
● కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు

అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అక్రమ ఇసుక, మట్టి రవాణాపై జిల్లా అధికార యంత్రాంగం నిఘా పెట్టింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సంయుక్తంగా దాడులు చేపడుతున్నారు. ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేసి భారీగా జరిమానా విధిస్తున్నారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీగితే సంయుక్త ఆధ్వర్యంలో సహజ వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్రమ రవాణాపై ప్రత్యేకనిఘాతో పాటు నిరంతరం దాడులు చేయడంతో అక్రమార్కులు హడలిపోతున్నారు. ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం నిబంధనల మేరకు తరలించేందుకు కలెక్టర్ అనుమతి ఇస్తున్నారు. నిర్మాణదారులకు ఇసుక, మట్టికోసం ఇబ్బంది పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కావాల్సిన ఇసుక, మట్టి సమకూర్చాలని ఆయా మండలాల తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చారు.

● జిల్లాలో 691 వాహనాలు సీజ్

జిల్లాలో అనుమతి లేకుండా మొరం, మట్టి తరలిస్తున్న 691వాహనాలను మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసి రూ. 1,02,026 జరిమానా విధించారు. అలాగే అధికారికంగా అనుమతి లేకుండా మొరం, మట్టి తవ్వకాలు చేస్తున్న జిల్లాలోని ఆయా మండలాల్లో నలుగురికి రూ. 2,87,515 జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. జిల్లాలో జూలై 21న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో హిటాచి, 12న ఇల్లంత కుంట మండలం గాలిపెల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, 28న ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, జూన్ 28న ఇందిరమ్మ ఇళ్ల పేరుతో వాహనాలకు బ్యానర్‌కట్టి వేములవాడరూరల్ మండలంలోని...

- మిగతా 8లో

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం అంబేద్కర్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు రిజిష్టర్, వ్యాక్సిన్ గదితో పాటు మందుల గదిలోని మందులను కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సేవలపై ఆసుత్రిలోని రోగుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గర్భిణీలు ప్రభుత్వం ఆసుపత్రులలోనే పేర్లు నమోదు చేసుకునే విధంగా సిబ్బంది చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న సేవలు, వసతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిరంతరం పరీక్షలు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులతో పాటు ఇతరాత్ర అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

సిరిసిల్ల ఆర్డీవో పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

సిరిసిల్ల కలెక్టరేట్: భూముల సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోరా అంటూ సిరిసిల్ల ఆర్డీవో పనితీరుపై జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మండిపడ్డారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొలకాని శంకరయ్య, లస్మయ్య అనే ఇద్దరు అన్నదమ్ములకు చెందిన 28 గుంట వారసత్వ భూమి లస్మయ్య కొడుకు రవి శంకరయ్యకు తెలియకుండా 1996 సంవత్సరంలో అక్ర మంగా పట్టా చేసుకున్నాడు. 2016 సంవత్సరంలో ధరణి పోర్టల్‌లో చూడగా తన భూమిని రవి అక్రమంగా పట్టా చేసుకున్నాడని గుర్తించిన శంకరయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌తో విచారణ జరిపించగా అక్రమ పట్టాగా తహసీల్ధార్ గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి శంకరయ్యకు న్యాయం చేయాలని సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లకు ఫైల్లను అందించి ఆదేశించారు. శంకర య్యకు పట్టా చేయకుండా లస్మయ్య ఇబ్బందులు పెడుతున్నాడని సోమవారం శంకరయ్య జిల్లా కలెక్టర్‌లో జరిగే ప్రజావాణికి వచ్చి మళ్లీ జిల్లా కలెక్టర్‌ను వేడుకోవడంతో ఆయన స్పందించారు. కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోరా అంటూ అక్కడే ఉన్న సిరిసిల్ల ఆర్డీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించాలన్నారు.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

మెయిన్‌రోడ్డుపై తనిఖీలతో వాహనదారుల ఇబ్బందులు

తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం పోలీసులు నిర్వహించిన తనిఖీలు ఇబ్బందికరంగా మారాయని వాహనదారులు ఆరోపించారు. రోడ్డుపై కొందరు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తుంటే మరి కొందరు పోలీసులు రోడ్డు పక్కన నిలబడి తప్పించుకునే ప్రయత్నంలో ఉన్న వాహనదారులకు ఎదురుగా వెళ్లడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటున్నారు. మెయిన్ రోడ్డుపై పోలీసులను చూసిన భయంతో వాహనదారులు వెనుకకు స్పీడ్‌గా వెళ్తే వెనుకాల వచ్చే వాహనాలను ఢీకొట్టే పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. ఇటీవల పోలీసులు వాహనాలకు ఎదురుగా దూసుకురావడంతో పలువురు అదుపు తప్పి గాయపడట్లు పేర్కొంటున్నారు. మెయిన్‌రోడ్డుపై తనిఖీలు ప్రమాదకరంగా మారాయంటున్నారు.

పోలీసు సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం

- ఎస్పీ మహేశ్ బి. గీతే



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోలీస్ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 28 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్‌చేసి బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు.

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం

సిరిసిల్ల ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పొద్దంతా ఎండ వేడితో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉదయం నుంచే మే నెలలో తలపించే ఎండ వేడి పెరిగింది. సాయంత్రం జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురువడంతో ఊరట చెందారు. సోమవారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు రుద్రంగి లో 37.9 డిగ్రీలు, చందుర్తిలో 34.7 డిగ్రీలు, వేములవాడ రూరల్ 36.8 డిగ్రీలు, వేములవాడలో 33.8 డిగ్రీలు, కోనరావుపేటలో 37.3 డిగ్రీలు, వీర్నపల్లిలో 33.2 డిగ్రీలు, బోయిన్‌పల్లిలో 34.1 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 34.0 డిగ్రీ, సిరిసిల్లలో 35.2 డిగ్రీలు, గంభీరావుపేటలో 33.0 డిగ్రీలు, ముస్తాబాద్‌లో 34.3 డిగ్రీలు, ఇల్లంత కుంటలో 35.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. దీంతో ప్రజలకు వేసవికాలంలో పడ్డ ఇబ్బందులు మరోసారి గుర్తుకొచ్చాయి. ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతుండగా సాయంత్రం సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో భారీగా వర్షం కురిసింది. దీంతో కాస్త ఊరట చెందారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 39.0 మిల్లీమీటర్ల వర్షం కురవగా వేములవాడలో 14.0 మిల్లీమీటర్లు, వేములవాడ రూరల్ 4.5 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 8.3 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 19.3 మిల్లీమీటర్లు, గంభీరావుపేట 13.5 మిల్లీమీటర్లు, తంగళ్లపల్లిలో 7.5 మిల్లీమీటర్లు, బోయిన్‌పల్లిలో 2.8 మిల్లీమీటర్లు, ఇల్లంత కుంటలో 29.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో పత్తి, మొక్కజొన్న పంటలు వాడిపోతున్న క్రమంలో కురిసిన వర్షం మళ్లీ జీవం పోసినట్లు అయింది.

బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు మూడు రోజుల పాటు వివిధ రూపాల్లో విజ్ఞాపనలతో పాటు నిరసన తెలుపనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో టౌన్ క్లబ్ హాల్‌లో నాగుల మల్లయ్య స్మారక పురస్కారాన్ని చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌కు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ నాగుల మల్లయ్య ఆనాటి కాలంలోనే బీసీల కోసం నిరంతరం కొట్లాడారని, బీసీలు రాజకీయంగా ఎదగాలని ఎన్నో కార్యక్రమాలు చేశారని అన్నారు. 38 సంవత్సరాలగా వారిని స్మరించుకుంటూ వారి పేరు మీద పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. శాసనసభలో బీసీ రిజర్వేషన్ బిల్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెడితే బలపరిచే అవకాశం బీసీ బిడ్డగా తనకు రావడం అదృష్టమని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు సై అంటూనే ఢిల్లీలో నై అంటున్నారని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి పెంచడం లేదని ప్రశ్నించారు, కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, అవార్డు కమిటీ కన్వీనర్లు నాగుల సంతోష్, ఎండి సలీం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, మాజీ చైర్మన్లు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, పట్టణ కార్యదర్శి మ్యాన ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు బుర్ర నారాయణ, ఆడేపు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



హరిప్రసాద్‌కు పురస్కారాన్ని అందిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ


కలెక్టర్‌పై కటకం స్టేటస్ కలకలం

సిరిసిల్ల ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌పై మాజీ ఎమ్మెల్యే కటకం మత్స్యం జయం పెట్టిన స్టేటస్ కలకలం రేపింది. స్టేటస్‌లో పాటు ఎక్స్ వేదికగా పోస్ట్ కూడా చేయడం చర్చనీయాశంగా మారింది. అంతే కాకుండా ఫేస్‌బుక్‌లో కూడా ఈ అంశాన్ని పోస్ట్ చేయడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కటకం పోస్ట్ సారాంశం ఇలా ఉంది.. నా సుదీర్ఘ సామాజిక- రాజకీయ జీవన ప్రయాణంలో అనేక జిల్లాల కలెక్టర్లను చూశాను. చాలా మంది కలెక్టర్లను కలిసాను. కానీ సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వంటి వారిని ఎప్పుడూ చూడలేదంటూ తన వేదనాత్మక పరిశీలన అంటూ కటకం పోస్ట్ చేశారు. కలెక్టర్‌కు ఫోన్ చేసిన ప్రతిసారీ ఒకే రింగ్ అయి కట్ అవుతూ బీజీగా ఉందన్న సంకేతం వచ్చింది. దీనిపై కలెక్టర్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడి తన నెంబర్ బ్లాక్ అయిన విషయం చెప్పినా మార్పు రాలేదన్నారు. రాజకీయ ప్రత్యర్థుల సలహాతో 40 ఏళ్లుగా ఉన్న గన్ లైసెన్స్ రద్దు చేయాలనే ప్రయత్నం కూడా జరుగుతోందని, కచ్చితంగా నన్ను నిరాయుధుణ్ణి చేయాలనే నా రాజకీయ శత్రువుల కుట్ర అంటూ.. ఇలా అనేక అంశాలను ప్రస్తావిస్తూ కటకం స్టేటస్ పెట్టడం అటు రాజకీయ వర్గాల్లో ఇటు అధికార వర్గాల్లో చర్చకు తెరలేపింది. అధికార పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కలెక్టర్‌పై స్టేటస్ పెట్టడం, ఎక్స్ వేదికగా పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది.

స్థానిక సమరానికి సమాయత్తం కావాలి

● నాప్స్‌కాబ్ చైర్మెన్ రవీందర్‌రావు

గంభీరావుపేట, ఆగస్ట్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమరానికి పార్టీ శ్రేణులు సమయత్తం కావాలని నాప్స్‌కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట, నాగంపేట, సముద్రలింగాపూర్, గోరంటాల ఎంపీటీసీ పరిధిలో రవీందర్‌రావు సోమవారం పర్యటించారు. కార్యకర్తలు సమన్వయంతో వచ్చే ఎన్నికల్లో ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 8న కరీంనగర్‌లో జరిగే బీసీ గర్జనకు పెద్ద ఎత్తున తరళి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాపగారి వెంకట స్వామి, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, మండల ప్రధాన కార్య దర్శి గంద్యాడపు రాజు. పార్టీ నాయకులు దయాకర్‌రావు, కమ్మరీ రాజారాం, లక్ష్మన్, శేఖర్‌గౌడ్, మల్లేశం, లింగమ్‌యాదవ్, వహీద్, బండ రమేష్, రత్నాకర్, గోవింద్, గోపి తదితరులు ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న రవీందర్‌రావు

ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలి



చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రం నేతన్న చౌక్ వద్ద చెవ్వులో పూలను ధరించి బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, కార్మికులకు రూ. 2వేలు పింఛన్ పెంచకపోవడం, మహిళలకు రూ.2500, యువతులకు స్కూటీలు ఇవ్వకపోవడం దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వడ్లూరి సాయి, సూర్య, మనీష్‌గౌడ్, ఎస్‌కె అఫ్రోజ్, అడిచర్ల సాయి, హరీష్, శ్రీనివాస్‌రావు, సంపత్‌రాజు, రాహుల్, సయ్యద్ పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్ అమలులో భాగంగా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన ధర్నాకు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆ పార్టీ ముఖ్య నాయకులు సోమవారం ఢిల్లీకి తరలివెళ్లారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుని అక్కడ నుంచి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో కలిసి ప్రయాణించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ తదితరులు ఉన్నారు.



మీనాక్షీ నటరాజన్‌తో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

'మధ్యాహ్న' కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంఈవోకు సమ్మె నోటీసు అందిస్తున్న నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. సమస్యల సాధనలో భాగంగా ఈ నెల 6, 7 తేదీలలో నిర్వహించ తలపెట్టిన సమ్మె నోటీసును ఎల్లారెడ్డిపేట మండల వనరుల కేంద్రంలో ఎంఈవో కృష్ణహరికి కార్మికులతో కలిసి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు పని భద్రత, గుర్తింపు కార్డులను అందించాలని అన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్యాస్, కోడిగుడ్లు, నిత్యావసర సరుకులను ప్రభుత్వం సరఫరా చేయాలని అన్నారు. స్పందించకుంటే సెప్టెంబరు1 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని లక్ష్మణ్‌యాదవ్ హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మీ, సత్తవ్వ, రోజా, మల్లవ్వ, దేవవ్వ, మమత, అంజవ్వ, మణవ్వ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సముదాయం నిర్మించాలని రాస్తారోకో



గంభీరావుపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

గంభీరావుపేట, ఆగస్ట్ 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో నూతన మార్కెట్ సముదాయం నిర్మించాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద భైఠాయించి రోడ్డుపై కూరగాయలతో నిరసన తెలిపారు. మార్కెట్ సముదాయం లేక కూరగాయలను అమ్మే రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టడంతో ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి వచ్చి వారిని సముదాయించి, శాంతింపజేశారు. ఈ రాస్తారోకోలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు విగ్నేష్, మల్లేశ్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నర్సింలు, ఎలెందర్, కార్యదర్శి తోక స్వామి, సీనియర్ నాయకులు పత్తి స్వామి, సత్యనారాయణ, చంద్రంయాదవ్, సత్యం, దేవరాజ్, శ్రీనివాస్, ప్రధాంత్, సంతోష్, నరేష్, రైతులు ఎల్లం, దేవవ్వ, నారాయణ, చంద్రకళ, స్వప్న, రాజ్యలక్ష్మి, రాజవ్వ ఉన్నారు.

అప్పు చెల్లించడం లేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని అడిగితే చంపుతానని బెదిరించడంతో మనస్థాపానికి గురైన ఓవ్యక్తి సెల్ఫీవీడియోతీసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ తనవద్ద ఉన్న రూ.25లక్షలను వనం హరీష్ అనే వ్యాపారికి ఏడాదిన్నర క్రితం అప్పుగా ఇచ్చాడు. అప్పటినుంచి ఇప్పటివరకు డబ్బుల కోసం కృష్ణ, హరీష్ ఇంటికి వెళ్లి అడుగుతున్నా ఇవ్వడం లేదు. ఈ క్రమంలో కృష్ణ తన డబ్బులు తనకు ఇవ్వాలని హరీష్‌ను మరోసారి అడగగా హరీష్ ఇష్టాను సారంగా దూషించాడు. దీంతో మనస్థాపానికి గురై హైస్కూల్‌గ్రౌండ్‌లో సెల్ఫీ వీడియోతీసి గడ్డిమందు తాగాడు. గమనించిన స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కృష్ణను మెరుగైన చికిత్స కోసం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి


కోట లింగయ్య(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోట గ్రామానికి చెందిన కోట లింగయ్య(55) తాటిచెట్టుపై నుంచి పడగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కులవృత్తిలో భాగంగా సోమవారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతూ జారి కిందపడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


ఆదిరెడ్డి(ఫైల్)

మల్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లారీలు నడుపుకునే వ్యాపారంలో నష్టాలు చవిచూడడంతో మల్యాలకు చెందిన ముకుందు ఆదిరెడ్డి అలియాస్ డ్రైవర్‌రెడ్డి (59) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిరెడ్డికి లారీలు ఉండగా కొన్నాళ్లుగా నష్టాలు రావడంతో మానసికంగా బాధ పడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ పడుకున్నాక సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం వేకువ జామున భార్య చూడగా వెంటనే కుటుంబసభ్యులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుమారుడు విక్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తీవ్రగాయాలై చికిత్సపొందుతున్న గర్వందుల శ్రీహరి గౌడ్(64) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన శ్రీహరిగౌడ్ శనివారం జగిత్యాలకు ద్విచక్ర వాహనంపై ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా లింగంపేట చౌరస్తాలో కిందపడి పోగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు శ్రీహరి గౌడ్ భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద మృతిపై విచారణ వేగవంతం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బుట్టిరాజారాం కాలనీకి చెందిన ఐలవేని సంపత్(45) మృతిపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. సంపత్ జూలై 29న ఒక విందుకు హాజరయ్యేందుకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈనెల1న బొమ్మకల్ ప్రకృతి ఆసుపత్రి సమీపంలో రోడ్డుపక్కన చెట్లపొదల మధ్యన కుళ్లిన స్థితిలో అతడి మృతదేహం లభ్యమైంది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సంపత్ అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా సంపత్ హత్యకు గురయ్యాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. సంపత్‌ను హత్య చేసింది ఆయన సమీప బంధువులని తెలుస్తోంది. పోలీసులు ఈ ఘటనపై వివరాలు వెల్లడించడంలేదు. సంపత్‌ను ఎవరు హత్య చేశారు? ఎందుకు హత్య చేశారు? అనే వివరాలు విచారణ అనంతరం వెల్లడించే అవకాశముంది.



పర్యావరణ హితం నానో యూరియా

- నేల, గాలి, నీటి కాలుష్యం నివారణ
- చీడపీడలు, తెగుళ్లు ఉధృతికి చెక్
- సంకట హరణ బీమా పాలసీ వర్తింపు
- వాడకాన్ని పెంచడానికి రైతులకు అవగాహన

మంథని, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితమైన నానో యూరియా రైతులకు అందుబాటులోకి వచ్చింది. సాగులో యేటా పెరుగుతున్న ఖర్చులు, ప్రకృతి ఏర్పడే ప్రతికూల పరిస్థితులు, చీడ పీడలు, తెగుళ్ల కారణంగా తగ్గిపోతున్న పంటల దిగుబడితో రైతులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో రైతులకు సంజీవనిలా నానో యూరియా ఇటీవల అందుబాటులోకి వచ్చింది. నానో యూరియా ప్లస్ వినియోగంతో నేల, గాలి, నీటి కాలుష్యంతోపాటు పంటల సాగులో చీడ పీడల, తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తుంది. నానో యూరియా ప్లస్ జీవ సురక్షితమైన పర్యావరణానికి అనుకూలిస్తుంది. దీన్ని నిల్వ, రవాణా సులభతరం. దీన్ని వినియోగం ద్వారా రైతుల పంటలు సంకట హరణ బీమా పాలసీ పరిధిలోకి వస్తాయి. దీని ద్వారా ఏదైన విపత్కర పరిస్థితుల్లో పంట నష్ట పోతే రైతులకు బీమా ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంది. ఇటీవలనే వినియోగంలోకి వచ్చిన నానో యూరియా ప్లస్‌ను వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, చెరుకు, పప్పు దినుసులు, కూరగాయలాంటి వివిధ రకాల పంటల్లో వాడటం వలన కలిగే లాభాలు, ప్రయోజనాలు, దిగుబడి, ఖర్చుల ఆదా, కాలుష్య నివారణపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోజనాలు:

- నానోయూరియా ప్లస్ అనేది అన్ని పంటలకు నత్రజనిని సమర్థవంతంగా అందిస్తుంది. దీని పిచికారి పంటలలో నత్రజని లోపాలను సరి చేస్తుంది.
- దీని పిచికారి వలన ఎక్కువ పత్రహరితం, మెరుగైన కిరణజన్య సంయోగ క్రియ సామర్థ్యంతో పంట దిగుబడి పెరుగుతుంది.
- అనుకూలమైన పరిస్థితుల్లో దీన్ని పోషక వినియోగ సామర్థ్యం 90 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది.
- సాంప్రదాయ యూరియా కంటే తక్కువ ధర, రైతులకు తక్కువ ఖర్చు.

ఆకులపై పిచికారి:

- నానో యూరియా ప్లస్ ఒక ఎకరాకు 250-500 మిల్లీలీటర్లు పిచికారి చేసుకోవాలి.
- స్ప్రేయర్ రకాన్ని పంట దశను బట్టి అవసరమైన నీటి పరిమాణం మారుతుంది.
- నానో యూరియా ఎకరం పంట విస్తీరానికి 4-6 ట్యాంక్‌ల స్ప్రే ద్రావణం సరిపోతుంది.
- నానో యూరియా ప్లస్ పిచికారి మిశ్రమాన్ని తయారు చేయటానికి శుభ్రమైన నీటి ఉపయోగించాలి.

పిచికారి విధానం:

- 2-4 మిల్లీ లీటర్ల నానోయూరియా ప్లస్‌ని లీటర్ నీటిలో కలిపి ఆకులపై, శాఖీయోత్పత్తి దశలో, 20-25 రోజుల తర్వాత రెండో సారి పిచికారి చేయాలి.
- దీర్ఘ కాల, అధిక నత్రజని అవసరమయ్యే పంటలకు అదనపు నానోయూరియా పిచికారి చేసుకోవచ్చు.

ఏ పంటలకు ఏ దశల్లో పిచికారి చేయాలి..

- వరి, మొక్కజొన్న, జొన్న పంటలో పిలక దశలో మొదట, రెండోసారి పూతకు ముందు దశలో, మూడోసారి నత్రజని అవసరాన్ని బట్టి పిచికారి చేసుకోవాలి.
- పత్తి పంటలకు మొదటి దశ శాఖీయోత్పత్తి దశలో, రెండోసారి పూతకు ముందు, కాయ ఏర్పడ్డ దశలో మూడోసారి పిచికారి చేయాలి.
- పండ్లు, పూల పంటలకు నత్రజని అవసరాన్ని బట్టి పూతకంటే ముందు కాయ ఏర్పాటు దశ, కాయ ఎదిగే దశల్లో పిచికారిలు చేసుకోవాలి.
- ఉదయం లేదా సాయంత్రం వేళ్లల్లో పిచికారి చేయాలి.
- పిచికారి చేసిన 8 గంటల లోపు వర్షం పడితే మళ్ళీ పిచికారి చేసుకోవాలి.
- 500 ఎంఎల్, ఇఫ్‌కో సహకార సంఘాలు, పీఎంకేఎస్‌కే, విక్రయ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

ముందు జాగ్రత్తలు:

- తయారీ తేదీ నుంచి 24 నెలల్లో ఉపయోగించాలి.
- ముఖానికి మాస్క్ దర్శించాలి.
- చల్లని, పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి.
- పిల్లలు, జంతువులకు దూరంగా ఉంచాలి.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రూ.7700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 15క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7700, కనిష్ఠదర రూ.7650 చెల్లించి ప్రైవేట్‌ట్రేడర్స్ కొనుగోళ్లు చేపట్టారు.

ఆలయంలో దొంగతనం

మల్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయంలోని రెండు హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకుడు నల్ల రాజేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

జగిత్యాల ఆలయంలో..

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేట శివారులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. దొంగలు ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. గంగపుత్ర సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుస్తెల తాడు చోరీ

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో ఇంట్లో నిద్రిస్తున్న దాసరి ఈశ్వరమ్మ అనే వృద్ధురాలి మెడలో నుంచి ఓ దొంగ పుస్తెల తాడును సోమవారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లాడు. ఈశ్వరమ్మ తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియనివ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును అపహరించుకు వెళ్లాడు. బాధితురాలి కుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తొగర్రాయిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

సుల్తానాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయిలోని పురాతన శివకేశవ అంజనేయ ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి. ఈ సంఘటన నెలరోజుల క్రితం జరగగా సోమవారం విషయం వెలుగులోకి వచ్చిందని ఆలయ ధర్మకర్తలు, మాజీ సర్పంచ్ కర్క శంకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలోని మానేరు వాగును ఆనుకొని ఉన్న గుడిబండ వద్ద శివ పంచాయతన ఆలయంలో ఐదు విగ్రహాలు ఉంటాయి. ఈ ఐదింటిలో కొన్ని విగ్రహాలను పెకిలించి వాటికింద గుప్తనిధుల కోసంతవ్వారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దర్యాప్తు చేసి నిందితులను గుర్తించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

వీణవంక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ శివరాత్రి బాపుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన సీపీ

శంకరపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని సోమవారం సీపీ గౌస్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. నూతన పోలీస్‌స్టేషన్‌లోని స్టేషన్‌హౌస్, ఆఫీసర్ రూమ్, రైటర్ రూమ్, రికార్డుల గది, రిసెప్షన్ కౌంటర్, వెయిటింగ్ హాల్ తదితర వాటిని పరిశీ లించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరకోవడంతో పాత పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అద్దె భవనంలోకి మార్చినట్లు తెలిపారు. సొంత భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో సేవలు కొనసాగుతాయని, మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. త్వరలో కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, వెంకట్, నిరంజన్, ఎస్ఐలు శేఖర్‌రెడ్డి, తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శంకరపట్నంలో పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీపీ గౌస్ ఆలం

ఉత్తమ పోలీస్ డాగ్‌గా సింబా

కోల్‌సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మమునూరు పీటీసీలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో కాళేశ్వరం జోన్ నుంచి నార్కోటిక్ డాగ్ విభాగం పోటీలో పాల్గొని గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడంలో పోలీసు జాగిలం సింబా, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం. వేణుగోపాల్ కృష్ణ గోల్డ్‌మెడల్ సాధించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోలీస్‌డాగ్‌గా సింబా ఎంపికైంది. సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా నార్కోటిక్ డాగ్ సింబా, డాగ్ హ్యాండ్లర్‌ను అభినందించారు. 2026ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీమీట్‌లో పాల్గొని మరిన్నిపతకాలు సాధించాలని రాష్ట్రానికి, రామగుండం పోలీస్‌కమిషనరేట్‌కు పేరు తీసుకురావాలని తెలిపారు. మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ పీ కరుణాకర్, ట్రాఫిక్‌ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి సంపత్, మల్లేశం పాల్గొన్నారు.


పోలీస్ డాగ్ సింబాకు బంగారు పతకం బహూకరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

గొర్రెల దొంగలు పట్టివేత

కోనరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ శివారులో గొర్రెలను చోరీచేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, బెజ్జంకిమండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బండి అశోక్, కెంగర్ల చందు అనుమానాస్పదంగా వాహనంపై ప్రయాణిస్తున్న విషయాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఇటీవల ఇల్లంతకుంట, చందుర్తి, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గొర్రెలదొంగతనాలకు పాల్పడ్డట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు గొర్రెలు, రెండు గొర్రె పిల్లలు, ఒక పొట్టేలు, వారు ఉపయోగిస్తున్న ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి గురైన మొత్తం విలువ సుమారు రూ.48వేలు. అలాగే మిగిలిన గొర్రెలను పత్రి నర్సింహులు అనే వ్యక్తికి రూ.50వేలకు అమ్మి, ఆ డబ్బును ఖర్చుచేశామని నిందితులు వెల్లడించారు. ఈ దొంగతనం కేసు చేధించిన ఎస్ఐతోపాటు, కానిస్టేబుళ్లు రవి,విశాల్, జగన్‌ను చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి వచ్చిన బాధిత కుటుంబం
- మందుడబ్బాను లాక్కున్న పోలీసులు

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన భూమిని కొందరు కబ్జాచేశారని, వారికి వత్తాసు పలుకుతున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి పురుగుల మందుడబ్బాతో వచ్చింది. అక్కడేఉన్న పోలీసులు అతడినుంచి మందు డబ్బాను లాక్కున్నారు. బాధితుడు గంగాధర మల్లేశం వివరాల ప్రకారం.. గంగాధర మండలకేంద్రానికి చెందిన గంగాధర మల్లేశం మండలంలోని సర్వే నంబరు 94లో 34గుంటల భూమిని, అదే మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎండీ గౌస్ నుంచి కొనుగోలు చేశాడు. ఆ భూమిని 2011 డిసెంబరు 27న తన భార్య గంగాధర శాంతమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆ భూమిలో కాస్తులో ఉన్నాడు. ఎండీ నజీర్ అనేవ్యక్తి అక్రమంగా తమ భూమిలో ప్రహరీ, రేకులషెడ్డు నిర్మించాడని, ఈ విషయాన్ని 2025 జూన్ 13న స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపాడు. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరగా తమను లక్ష రూపాయలు అడిగినట్లు ఆరోపించాడు. అందుకు నిరాకరించడంతో అక్కత తమకు భూమి లేదంటూ భయభ్రాంతులను చేశారని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని గతనెల 27న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరాడు.


పురుగుల మందు డబ్బాతో వచ్చిన బాధితుడు గంగాధర మల్లేశం

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

- 18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ.లక్ష నగదు స్వాధీనం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని వివిధప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా దొంగతోపాటు, దొంగిలిచిన సొత్తు కొనుగోలుచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సీపీ గౌస్‌ఆలం కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి (ప్రస్తుతం ఆర్మూర్ మండలం ఏసపల్లి)కి చెందిన టేకు చిరంజీవి(22) హార్వెస్టర్‌డ్రైవర్‌గా పనిచేసేవాడు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలకు పథకం వేశాడు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలోని గ్రామాల్లో పగలంతా కారులో తిరిగి తాళంవేసి ఉన్న ఇళ్లను గుర్తించేవాడు. ఆ ఇళ్లను మరిచిపోకుండా ఉండేందుకు గూగుల్‌మ్యాప్ లోకేషన్ షేర్ చేసుకునేవాడు. అర్ధరాత్రి మ్యాప్ ద్వారా అక్కడికి చేరుకొని దొంగతనాలకు పాల్ప డేవాడు. ఇలా జిల్లాలోని షానగర్, గంగిపెల్లి, పోరండ్ల, బొమ్మనపల్లి, చీమలకుంటపల్లి, వెల్బూర్‌గ్రామాల్లో ఏడు దొంగతనాలు చేశాడు. దొంగిలించిన సొత్తును చిరంజీవి తండ్రి గంగసాయి నిజామాబాద్ నందిపేటలో బంగారం దుకాణం నిర్వహిస్తున్న కొండూరు గ్రామానికి చెందిన బంగారు నర్సయ్య(44)కు విక్రయించేవాడు. ఈ కేసులో చిరంజీవితోపాటు నర్సయ్యను అరెస్టుచేసినట్లు సీపీ తెలిపారు. నిందితుడివద్ద నుంచి 18తులాల బంగారం, 164తులాలవెండి, లక్షరూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికిచెందిన కారు, మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన ఇనుపరాడ్లు, గ్లౌస్‌లు, మాస్క్‌లు సీజ్ చేశారు.

నిందితుడిని పట్టుకునేందుకు కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ సీఐ గడ్డం సదన్‌కుమార్, సీసీఎస్ సీఐ ప్రకాష్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్, క్రైం పార్టీ కానిస్టేబుల్ నరేష్, జైపాల్, సీసీఎస్ కానిస్టేబుల్ రాజశేఖర్, వేణుగోపాల్, అనిల్, అవినాష్‌తో సీపీ ప్రత్యేటీంలను ఏర్పాటు చేశారు. రంగంలోకి దిగిన పోలీసు టీంలు దొంగతనాలు జరిగినస్థలంలో సెల్‌ఫోన్ డంపు, టోల్‌ప్లాజా సీసీకెమెరాలను పరిశీలించి చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టుచేశారు. నిందితుడి నుంచి 18తులాల బంగారం, 164తులాలవెండి, లక్ష రూపాయలనుస్వాధీనం చేసుకున్నారు.నిందితుడి కారు, మొబైల్‌ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన ఇనుపరాడ్లు, గ్లౌస్‌లు, మాస్క్‌లు సీజ్‌చేశారు. ఈసందర్భంగా సిబ్బందిని సీపీ అభినందించారు. సమావేశంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీసీఎస్ ఏసీపీ జాన్‌నర్సింహులు, సీఐలుసదన్‌కుమార్,ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు


దొంగలను అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


గంజాయి విక్రయించిన వారిని అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి

తంగళ్లపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు. గ్రామశివారులో స్మశాన వాటిక వద్ద గంజాయి విక్రయిస్తున్న బద్దెనపల్లి గ్రామానికిచెందిన ఎండీ సాదిక్, తంగళ్లపల్లికి చెందిన రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న ఎస్ఐ ఉపేంద్రచారి, యేసయ్య, రవిందర్, కానిస్టేబుల్స్ నరేందర్, ప్రశాంత్, శ్రీకాంత్, సందీప్, అబ్బాస్ అలీ, రామ్మోహన్‌లను సీఐ అభినందించారు.

అక్రమ ఇసుక డంపులు సీజ్

వీణవంక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో సర్వేనం 222గల భూమిలో అక్రమంగా నిలువచేసిన ఇసుకడంపులను రెవెన్యూ అధికారులతోకలిసి పోలీస్‌లు సీజ్ చేశారు. అక్రమంగా నిలువఉన్న 96ట్రిప్పుల ఇసుకను సీజ్‌చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొళ్లపల్లి వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం గోదావరిఖని వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో నలుగురు యువకులకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయాలపాలైన యువకులను పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. కారులోగల వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కోరుట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ శివారులోని పశువైద్య కళాశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేసి పయాజుల్ రెహమాన్ అనే వ్యక్తి ని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మరో వ్యక్తి పరారైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పయాజుల్ రెహమాన్ కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వాడిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. అతడి వద్ద 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయితో పాటు పయాజుల్ రెహమాన్ ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు.


మల్లాపూర్‌లోని సోమేశ్వరస్వామికి వరద పాశం సమర్పిస్తున్న భక్తులు

సోమేశ్వర కొండపై వరద పాశం

మల్లాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని సోమేశ్వర కొండపై సోమవారం వరద పాశం నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో తయారు చేసిన వరదపాశాన్ని తల పెట్టుకుని కొండపైకి తరలివచ్చారు. స్వామి వారికి పూజల అనంతరం వరదపాశాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా సోమేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేసి రంగుల పూలతో అలంకరించి శివుడికి బిల్వపత్రిని సమర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్, నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



శుభలేఖ పంపండి..

శ్రీవారి దీవెనలు పొందండి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వధూవరులకు తిరుమల శ్రీవారి, అమ్మవార్ల ఆశీస్సులు అందితే అంతకంటే కావాల్సింది ఏముంటుంది.. టీటీడీ భక్తులకు ఇటువంటి అవకాశం కల్పించింది. వధూవరులు పూర్తి చిరునామాతో కూడిన వివాహ శుభలేఖను నెల రోజుల ముందు కార్యనిర్వహణాధికారి, టీటీడీ పరిపాలనా విభాగం, కేటీ రోడ్, తిరుపతి-517501 చిరునామాకు పంపాలి. అక్కడి శుద్ధ ప్రతి విభాగం వారు శ్రీవారి అక్షింతలు, కుంకుమ, కంకణాలు, వేంకటేశ్వర స్వామి- పద్మావతి అమ్మవార్ల ఫొటోలతో కూడిన పత్రిక, కల్యాణ సంస్కృతి పుస్తకాన్ని శుభలేఖను పంపించిన వారి అడ్రస్‌కు పంపుతారు.



రాజన్న ఆలయంలో శ్రావణ శోభ

దర్శించుకున్న 50 వేల మంది భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండవ సోమవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. సుమారుగా 50 వేల మంది వరకు భక్తులు తరలివచ్చి శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు తెల్లవారుజామున ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని కోడెమొక్కు, ధర్మ దర్శనం క్యూలైన్‌లలో బారులు తీరారు. కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు తెలిపారు. మహిళలు శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేసి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ముందు రావి చెట్టు కింద దీపాలు వెలిగించి పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండేలా దీవించమని ప్రార్థించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధా బాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్‌లు అధికారులు శ్రీనివాసచారి, రాజేందర్, నరేందర్ క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా చర్యలు చేపట్టారు.



ఘనంగా మహాలింగార్చన

శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారికి ఉదయం 5.30 గంటల నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదమంత్రోచ్చరణ మధ్య ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మంటపంలో మహా లింగార్చన చేపట్టారు. దీపాలను లింగాకారంలో వెలిగించిన భక్తులు మొక్కులు చెల్లించకున్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు


ధర్మపురి గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం శ్రావణ సందడి నెలకొంది. లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు, అర్చకులు శివాలయాల్లో స్వామి వారలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, బూస ప్రవీణ్ కుమార్, జన్మంచి శ్రీనివాస్, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.

కోటిలింగాలలో...

వెల్గటూర్: వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో సోమవారం శ్రావణ సందడి నెలకొన్నది. కోటిలింగాల గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాదులు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి వారిని ఆశీర్వదించారు.

చక్కని మొక్కల బడి

- మొక్కలు నాటిస్తూ.. మార్కులు వేస్తూ ప్రోత్సాహం
- బడి సంచి భారం తగ్గించేందుకు చర్యలు
- ఒద్యారం పాఠశాలలో నూతన ఒరవడి


ఆహ్లాదకరంగా పాఠశాల ఆవరణ



గంగాధర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఒద్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఉంటుంది. ఎటు చూసినా మొక్కలే కనిపిస్తాయి. పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులు వచ్చి బ్యాగులు తరగతి గదిలో పెట్టి మొక్కల వద్దకు వెళతారు. ఎందుకంటే వాటిని విద్యార్థులే నాటారు. వాటి సంరక్షణ బాధ్యత వారిదే.. మొక్కలు నాటి సంరక్షించినందుకు వారికి ఉపాధ్యాయులు మార్కులు వేస్తారు. ఆ పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగు భారం తగ్గింది. నిబంధనలు అనుసరించి బ్యాగు బరువును పరిమితం చేసేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆయనకు ప్రభుత్వం ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు అప్పజెప్పడంతో మండల వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొక్కలు నాటి.. సంరక్షించి..

ఒద్యారం పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్నారు. వాటి సంరక్షణ బాధ్యతలు వారికే అప్పజెప్పి అందుకు మార్కులు వేస్తున్నారు. దీంతో విద్యార్థులు మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వాటిని సంరక్షిస్తున్నారు. మూడేళ్ల క్రితం పాఠశాల ఆవరణలో 30 మొక్కలుండేవి. ప్రస్తుతం 280కి చేరింది. పాఠశాలలో ఆరవ తరగతిలో చేరిన ప్రతి విద్యార్థి పండ్ల మొక్కను నాటాల్సి ఉంటుంది. ఆ మొక్క శాస్త్రీయ నామం, విద్యార్థి పేరు, తరగతి, నాటిన సంవత్సరం వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. ఆలా నాటిన ప్రతి విద్యార్థికి సంవత్సరంలో అన్ని సబ్జెక్టులకు కలిపి 10 మార్కులు కలుపుతూ ప్రోత్సహిస్తున్నారు. ప్రతి శనివారం నోబ్యాగ్ డే అమలు చేస్తున్నారు. నాలుగవ శనివారం సందేశాత్మక చలన చిత్రాలు ప్రదర్శిస్తున్నారు. ఉపాధ్యాయులు కృషితో ఈ పాఠశాలలో చదివిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సహస్ర ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైంది.

'విద్యావాహిని'తో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు

ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ప్రభాకర్‌రావు ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యావాహిని పేరుతో ప్రత్యేకంగా వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై మండల వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన కృషి ఫలించి మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వం పాఠశాలల్లో 629 మంది విద్యార్థులు చేరారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభాకర్‌రావును అభినందించారు.

రెండేళ్లుగా మొక్కలను పెంచుతున్న..

శాన్వి, ఎనిమిదో తరగతి



పాఠశాలలో చేరినప్పుడు జామ మొక్కలను నాటాను. ఆరో తరగతిలో నాటిన మొక్కకు నిత్యం పాఠశాల ఆటల పీరి యడ్, విరామ సమయంలో నీరు పోస్తూ, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నాను. మొక్కను నాటిన సంవత్సరం, ఎవ్వరు నాటింది, ఏ రకం మొక్క నాటారనేది ఉపాధ్యాయులు ఒక స్టిక్కర్‌లో వివరాలను నమోదు చేస్తారు. దానిని మొక్కకు కట్టిస్తున్నారు స్కాన్ చేయగానే వివరాలు మొత్తం ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి.

బ్యాగు బరువు తగ్గింది

శ్రావ్య, ఎనిమిదో తరగతి



గతంలో బడి బ్యాగు నిండా పుస్తకాలతో భారంగా ఉండే ది. ఈ విద్యాసంవత్సరం నుంచి పాఠశాల ఉపాధ్యాయులు బ్యాగు బరువును తగ్గించారు. దీంతో మెడ నొప్పి, నడుం నొప్పి పోయింది. అవసరం లేని పుస్తకాలు, నోటుబుక్స్ పాఠ శాల డెస్క్‌లో దాచిపెట్టుకుంటున్నాను.


పుస్తకాల సంచిని తూకం వేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు

విద్యార్థుల ఇబ్బందిని గమనించి..

ఒద్యారం పాఠశాలలో ప్రస్తుతం 97 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరూ కిలోల కొద్దీ బరువున్న పుస్తకాల సంచిని మోయలేక ఇబ్బందిపడేవారు.. చిన్న తరగతుల నుండి పెద్ద తరగతుల వరకు బరువైన బ్యాగులను మోయలేక పోయేవారు. గమనించిన ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు పుస్తకాల సంచి బరువును తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. అవసరమున్న పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లేలా.. మిగతావి పాఠశాలలోని డెస్కుల్లో పెట్టుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం స్కూల్ బ్యాగ్ ఐదు కిలోలు మించి ఉండకూడదు. ప్రతి విద్యార్థి బ్యాగును తూకం వేయించి నిబంధనల మేరకు బరువు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభాకర్‌రావు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో గంగాధర మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో పుస్తకాల సంచుల బరువు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభాకర్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ విధానంతో ప్రస్తుతం విద్యార్థులకు బ్యాగు బరువు తగ్గి శారీరకంగా ఉపసమనం లభించింది.


పచ్చని చెట్లతో పాఠశాల ఆవరణ


కరీంనగర్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రారంభించిన కార్యాలయాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్‌లో మంత్రి సోమవారం క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో హుస్నాబాద్ శాసనసభ్యుడిగా, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడిగా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యాలయంలో అర్జీలు, విజ్ఞాపన పత్రాలు, సీఎం సహాయనిధి, ఇతర దరఖాస్తుల స్వీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారం అందుబాటులో ఉంటుం దన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, పడాల రాహుల్, గడ్డం విలాస్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర సత్య ప్రసన్నరెడ్డి, మడుపు మోహన్, మల్యాల సుజిత్, ఎండీ తాజ్, శ్రావణ్ నాయక్, బోనాల శ్రీనివాస్, కంకణాల అనిల్‌కుమార్, ఎస్‌ఏ మోసీన్, ముద్దం తిరుపతి, ఎస్‌ఎల్ గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల ప్రకాష్, పడిశెట్టి భూమయ్య, కట్ల సతీష్ పాల్గొన్నారు.

పోటీపరీక్షల్లో రాణించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలి

గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి

చొప్పదండి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్‌డీఏ, ఐఐటీ, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. సోమవారం మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్‌స్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్నిచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్‌డీఏ పోటీ పరీక్షలకు విద్యార్థులు అర్హత సాధించేలా ప్రత్యేక శిక్షణకు చొరవచూపాలని అన్నారు. ఎన్‌డీఏ శిక్షణకు సంబంధించిన, వ్యాయామ, యోగా, డ్రిల్, రన్నింగ్, వివిధ క్రీడాఅంశాలను పరిశీలించారు. కోచ్‌లు, ఆర్మీ సిబ్బందితో మాట్లాడి పలుసూచనలు చేశారు. ఆమెవెంట స్పెషల్ ఆఫీసర్ ఎం భీమయ్య, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, వైస్ ప్రిన్సిపాల్స్ కె శ్రీనివాస్, సీహెచ్ ప్రమోద్, సూపరింటెండెంట్ జె రమేష్, ఆర్మీసిబ్బంది, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సైనిక్ స్కూల్‌ను పరిశీలిస్తున్న అలుగు వర్షిణి

కాళేశ్వరం పాపాల చిట్టాను డైవర్ట్ చేసేందుకే బీఆర్‌ఎస్ చలో కన్నెపల్లి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్


మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

తిమ్మాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పాపాల చిట్టా బయటపడుతుండటంతో దాన్ని డైవర్ట్ చేసేందుకే బీఆర్‌ఎస్ చలో కన్నెపల్లి కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. సోమవారం కరీంనరగ్ జిల్లా అలుగునూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ నివేదికలో బీఆర్‌ఎస్ చేసిన పాపాల చిట్టా బయటపడిందన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు యదార్థముందన్నారు. కవిత తన సోదరిలాంటిదని, ఇంటి గుట్టు అంత బయటపెట్టిందని అన్నారు. వారి కుటుంబంలో అనేక సమస్యలు ఉన్నాయని, అవి వారి వ్యక్తిగత విషయమని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. వారు చేసిన పాపాలను త్వరలో ప్రజల ముందు పెడతామన్నారు. రాష్ట్రం ప్రభుత్వం రాజ్యాంగ పరంగా, చట్ట పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కోసం చట్టం చేసి కేంద్రానికి పంపించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేసి నిర్వహిస్తామని తెలిపారు.

జాగృతి మ్యాక్స్ పాలకవర్గానికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నేత కార్మికులను, మరో వైపు ప్రభుత్వాన్ని మోసం చేసిన సిరిసిల్ల పట్టణంలోని జాగృతి మ్యాక్స్ పాలకవర్గానికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. సొసైటీ అధ్యక్షుడు కొండ బత్తిని మల్లేశం, ఉపాధ్యక్షులు బొల్లబత్తి లక్ష్మీనారాయణ, కార్యదర్శి కట్ల శ్రీనివాస్, డైరెక్టర్‌లు చింతకింది సత్యం, బొడ్డు గోపాల్‌లకు మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధిస్తూ సిరిసి ల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.



సిరిసిల్లలో నేత కార్మికులకు పనికల్పించి ఆదుకోవాలని జాగృతి మ్యాక్ సొసైటీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా స్థానిక నేతకార్మికులతో బట్టలను నేయించకుండా బయట నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా చేనేత, జౌళిశాఖ ఏడి అశోక్‌రావు మే 29, 2017న గోదాంలో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 13లక్షల సరుకు ను సీజ్ చేశారు. జాగృతి మ్యాక్ సొసైటీ సభ్యులు అధిక లాభాలు పొందాలని ఓ వైపు ప్రభుత్వాన్ని మరోవైపు నేత కార్మికులను మోసం చేయడంతో గమనించిన ఏడీ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్‌ఐ రవి కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్‌ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరేశ్ 10మంది సాక్షులను కోర్టులో హాజరు పరచగా పిపి సందీప్ వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు

భగత్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నాగ శరణ్య, అంజలి, వర్షిని, సుశాంత్, ఇర్ఫాన్, ఎస్.శివ వివిధ విభాగాల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం పద్మశ్రీ తెలిపారు. గత నెల 27న కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కొత్తపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, హెచ్‌ఎం, పీడీ ఎల్.వెంకటరమణ, ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రావు, జూడో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వినయ్, దామోదర్, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

అక్రమాలపై నిఘా

(5వ పేజీ తరువాయి)

కొడిముంజ, అనుపురం పరిసరాల్లో అక్రమ రవాణా చేస్తున్న 10టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, రెండు జేసీబీలు, రెండు హిటాచిలను, ఇదే నెల 22న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో హిటాచీ, జేసీబీ, అలాగే ఒక టిప్పర్‌ను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్, ఎస్పీ కార్యాలయానికి తరలించారు.

అక్రమ రవాణాను ఉపేక్షించం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జిల్లాలో అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే ఉపేక్షించం. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వ సెలవు దినాల్లో ఇసుక, మట్టి తరలించవద్దు. ప్రభుత్వ పనిదినాలలో మాత్రమే అనుమతులు ఇస్తాం.

రాష్ట్ర స్థాయి కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం బీవైనగర్ షాదీఖానాలో రెండవ రాష్ట్ర స్థాయి ఆల్‌స్టైల్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలు జరిగాయి. సోమవారం చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కుసుమరామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కరాటే, కుంగుఫూ పోటీలలో వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. కుసుమరామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని అక్కెనపెల్లి కిరణ్మయి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వి హరిణి, ఆర్ వర్షిత, ఇ శ్రీచంద్ర, బంగారు పతకాలను సాధించారు. వై రిత్య, వై శాన్వి రజిత పతకాలను సాధించారు. రెండవ రాష్ట్ర స్థాయి పోటీలలో వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు, రజిత పతకాలను సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

టీజీఏ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్(టీజీఏ)జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్‌ను తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్ఎఫ్)చైర్మన్, తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆచార్య కత్తి వెంకటస్వామి పరామర్శించారు. జిల్లా కేంద్రంకు చెందిన చిలుముల జయవర్ధన్ తండ్రి రాజనర్సు(విశ్రాంత ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు)అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం జయవర్ధన్ కుటుంబ సభ్యులను వెంకటస్వామి పరామర్శించారు. రాజనర్సు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజనర్సుతో గల స్నేహ బంధాన్ని గుర్తు చేశారు.

ట్యాంకర్ డ్రైవర్‌పై గ్రామస్థుల ఆగ్రహం

ఇల్లంతకుంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సెప్టిక్‌ట్యాంక్ క్లీనర్ డ్రైవర్‌పై మండలంలోని ముస్కానిపేట గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక సంఘం సిరిసిల్ల పేరుతో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ సెప్టిక్‌ట్యాంక్ క్లీనర్ వాహనం మండలంలోని మరో గ్రామంలో నింపుకొని ముస్కానిపేట గ్రామంలో జనావాసాల వద్ద ఖాళీ చేశారు. విషయాన్ని గమనించిన గ్రామస్థులు డ్రైవర్‌ను నిలదీసి పోలీసులకు సమాచారం అందించారు.దీనిపై పంచాయతీ కార్యదర్శి రాజయ్య మాట్లాడుతూ డ్రైవర్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా పోచమ్మ అమ్మవారి విగ్రహ విగ్రహప్రతిష్ఠాపన



కొలనూరులో ఉత్సవాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న నూతన పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కాగా ఈ ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చందుర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం, పంటల సాగు విధానాలపై ప్రాజెక్టు రీసెర్చ్ కార్యక్రమంలో భాగంగా చందుర్తి మండలం మూడపల్లి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ అనుబంధ మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల విద్యార్థినిలు సాగు పనులు, గ్రామీణ వ్యవసాయ స్వరూపంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగుచేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిలో ఉన్న లోపాలను గుర్తించి నివారణపై అవగాహన కల్పించారు. పంటల సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు ఇచ్చారు. విశ్లేషణాత్మక విధానాలతో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వరూపాన్ని మ్యాపింగ్‌తో ప్రదర్శించారు. విద్యార్థినిలను పలువురు రైతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రావణమాసం.. భక్తుల రద్దీ



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి సోమవారం శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసం రెండవ సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. క్యూలైన్‌లో భక్తులు సుమారుగా నాలుగు గంటల పాటు నిరీక్షించారు. రాజన్నను దర్శించుకుని కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

- వేములవాడ కల్చరల్

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ● జనంతో కిటకిటలాడిన జిల్లా కలెక్టరేట్



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన ప్రజలు

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 4 (అంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సోమవారం ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అర్డీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్‌డీవో శేషాద్రిలు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 189 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు69, హౌసింగ్ శాఖకు 50, డీఆర్‌డీవోకు 17, ఉపాధికల్పన శాఖకు 8, ఎస్‌డీసీకి 8, జిల్లా సంక్షేమాధికారికి 6, జిల్లా విద్యాధికారికి 6, సిరిసిల్ల మున్సిపాలిటీకి 5, జిల్లా పంచాయతీ అధికారికి 5, సెస్‌కు 3, జిల్లా వ్యవసాయాధికారికి 3, ఎస్పీ కార్యాలయానికి 3, జీజీహెచ్‌కు 2, వేములవాడ దేవస్థానం ఈవోకు 2, జిల్లా వైద్యాధికారి 1, ఎల్‌డీఎంకు 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాపడంతో పాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకర్, జిల్లాపంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు చేయండి

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలనుంచి ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దుచేయాలంటూ గ్రామానికి చెందిన విద్యార్థులు తల్లులు వనజ, భారతి, పావనిలు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి వినతిపత్రం అందించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 83 మంది విద్యార్థులు చదుతున్నారని వారికి చదువు చేప్పేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెడికల్ లీవులో ఉన్నారని ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులల్లో ఒకరి వీర్నపల్లి పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారని మా విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని డిప్యుటేషన్ రద్దుచేయాలని కోరారు.

విద్యుత్ వైర్లను తొలగించండి

- కొమ్ము దేవయ్య, మల్లారం



వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో నివాసం ఉంటున్న నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. నా స్థలంలో విద్యుత్ వైర్లు ఉండడంతో నిర్మాణానికి అంటకంగా మారింది. ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్ల తొలగించాలని సెస్ అధికారులను కోరగా అందుకు రూ. 20వేలు ఖర్చు అవుతుందని ఆ డబ్బులు నన్ను భరించాలని చెపుతున్నారు. నేను ఇళ్ల కట్టుకునేందుకు అప్పులు చేయాల్సి వస్తుందని కలెక్టర్ స్పందించి విద్యుత్ వైర్లు తొలగించేలా చూడాలి.

దివ్యాంగురాలి పింఛన్ ఇప్పించండి

- అడగట్ల పద్మ, సాయినగర్, సిరిసిల్ల



సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నా. నాకు ఒక కాలులేదు. ముగ్గురు అడపిల్లలను పోషించడం భారంగా మారింది. కలెక్టర్ స్పందించి నాకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

పొలాల రోడ్డును కబ్జా చేశారు

- రాజయ్య, కిషన్, రైతులు

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో సర్వేనంబర్ 423, 424, 425లలో ఉన్న ముల్కల గండం ప్రాంతంలో పొలాల వద్దకు ఉన్న రోడ్డును కొంత మంది రైతులు కబ్జా చేశారు. దీంతో మేము వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. కలెక్టర్ సమస్య పరిష్కరించాలి.

వీర్నపల్లి క్లస్టర్ ఏఈవోగా ఫజిల్

వీర్నపల్లి,ఆగస్టు4,(ఆంధ్రజ్యోతి):తాత్కాలిక బదిలీ(డిప్యూటేషన్)పై వెళ్లిన ఏఈవో ఫజిల్ బదిలీ కాలం ముగియడంతో వీర్నపల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిగా సోమవారం భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫజిల్ మాట్లాడుతూ.. వ్యవసాయ సూచనలు, సలహాలు అందించేందుకు రైతులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల రైతులకు సమస్యలుంటే నేరుగా సంప్రదించాలన్నారు. అనంతరం ఏవో జయను మర్యాద పూర్వకంగా కలిశారు.

జవాన్‌ను సన్మానించిన ఎస్సై



బీఎస్ఎఫ్ జవాన్‌ను సన్మానిస్తున్న ఎస్సై

వీర్నపల్లి,ఆగస్టు 4,(ఆంధ్రజ్యోతి):వీర్నపల్లి మండలకేంద్రానికి చెందిన మల్లారపు వినయ్ ఇటీవల బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించడంతో స్థానిక ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మారుమూల ప్రాంతం నుంచి యువకులు ఉన్నతంగా రాణించడం గర్వకారణమన్నారు.

శ్రీబుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి

రుద్రంగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) శ్రావణ మాసం సోమవారం సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీ బుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నేతలు



ఢిల్లీకి తరలివెళ్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన బీసీ సింహ గర్జనను విజయవంతం చేయడానికి మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ఢిల్లీకి తరలివెళ్లారు. కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కచ్చకాయల ఎల్లయ్య, చిలుకల తిరుపతి, జలపతి, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మాజీ జడ్పీటీసీ గంగాధర్ ఉన్నారు.

వలస జీవుల తిరుగు పయనం

● వరినాట్లు ముగియడంతో సొంత గ్రామాలకు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో పనులు దొరకక పల్లెలకు వలస వచ్చిన కార్మికులు వ్యవసాయ పనులు పూర్తి కావడంతో తమ సొంత గ్రామాలకు పయనమయ్యారు. సొంత వాళ్లను వదిలి రాష్ట్రం కాని రాష్ట్రానికి చేరుకుని నెల రోజుల పాటు చెమట చుక్కలు చిందించిన కష్టజీవులు చేతుల్లో సంచులు, తలపై భారం ఉన్నా.. మనసులో తమ ఊరు చేరేందుకు అడుగులు వేశారు. తమ వారిని చూసేందుకు తహతహలాడారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామం నుంచి మూటముళ్లేలతో బస్టాండు వద్దకు చేరుకుంటున్న వలస జీవుల తిరుగు పయనం సోమవారం 'ఆంధ్రజ్యోతి' కంట పడింది. కూలీలు బస్సు కోసం వేచి చూశారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాకు చెందిన సుమారు 20 మంది వలస కూలీలు నెల రోజుల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి వరి నాటు వేసేందుకు వచ్చారు. చుట్టు పక్కల గ్రామాల్లో నాటు పనులు ముగియడంతో స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. తమ స్వస్థలాలకు చేరుకుంటున్నామనే ఆనందం వలస జీవుల్లో నెలకొంది. నెల రోజులు వరి నాటు వేస్తే ఒక్కొక్కరికి అన్ని ఖర్చులు పోనూ రూ.17 వేలు చేతికందాయని వలస కూలీలు పేర్కొన్నారు.



బస్సు కోసం వేచిచూస్తున్న వలస కార్మికులు

శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలి

బోయినిపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో పకడ్బందీగా విజిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ నిఘా పెంచాలని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బోయినిపల్లి పోలీస్‌స్టేషన్, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లను వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, స్టేషన్ రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై రివ్యూ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలిస్ సిబ్బంది తరచూ గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించాలని, గ్రామాల్లో ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే తెలిసేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్ఠం చేయాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అనంతరం పోలిస్‌స్టేషన్ ఆవరణంలో మొక్కలు కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు రాజ్ కుమార్, అంజయ్య పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో జీవితాలను పాడుచేసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మొగిలి

ఇల్లంతకుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యువకులు ఆన్‌లైన్ బెట్టింగులు ఆడి జీవితాలను పాడుచేసుకోవద్దని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. మండలంలోని జవారిపేట గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడి తీవ్రంగా నష్టపోయి ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో నిత్యం గమనించాలని సూచించారు. యువకులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పాటుపడాలన్నారు. సమయాన్ని వృథాచేయకుండా పుస్తక పఠనంలో గడుపాలన్నారు. చదువుకున్న వారికి నేడు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామంలో ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్‌తో పాటు పోలీస్‌సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

తంగళ్లపల్లి,ఆగస్టు 4,(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ అన్నారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు పునాదులు అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగల రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ ప్రచారం



మారుపాకలో బీజేపీ పథకాలను వివరిస్తున్న నాయకులు



చందుర్తిలో బీజేపీ నాయకులు



ధర్మారంలో బీజేపీ నాయకుల ప్రచారం

వేములవాడ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు ఎండగట్టాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. వేములవాడ మండలం మారుపాక గ్రామంలో 193,195 బూతులో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్‌పై వున్న వ్యతిరేకతతో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రజల ఆగ్రహానికి గురైందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజలు మోదీ, బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపి, మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం సోమవారం రహీంఖాన్‌పేట గ్రామంలో కార్యక్రమం జరిగింది. మానకొండూర్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామిగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం సాగింది. మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ మాట్లాడుతూ నిరుపేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పీఎం కిసాన్, సబ్సిడీపై ఎరువులు, డ్రిప్ పరికరాలను అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి తిప్పారపు శ్రావణ్, ఉపాధ్యక్షులు గుంటి మహేష్, చిమ్మనగొట్టు శ్రీనివాస్, దండవేని రజనీకాంత్, నాయకులు అశోక్‌యాదవ్, రాజుగౌడ్ ఉన్నారు.



రాచర్ల గొల్లపల్లిలో బీజేపీ ఇంటింటి ప్రచారం



రహీంఖాన్‌పేటలో బీజేపీ నాయకుల ప్రచారం

ఎల్లారెడ్డిపేట:: బీజేపీ పాలనలో పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని ఆపార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో స్థానిక నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలతో సోమవారం ఇంటింట ప్రచారం చేశారు. పీఎం నరేంద్ర మోదీ పాలన గొప్పతనం గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రామచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, పవన్, సాగర్, తేజశ్రీ, పూర్ణిమ, గణేశ్, శ్రీశైలం, కిరణ్‌నాయక్, మహేశ్, బాలకృష్ణ, రవినాయక్, నవీన్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోనరావుపేట బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ నాయకులు దడిగే గంగయ్య, కొమ్ము తిరుపతి, విజయ్, ఆసరి దేవరాజు, బాలయ్య, రాజ్ కుమార్, అనిల్, శ్రీకాంత్, మనిసాయి, హరికృష్ణ, మనోజ్, వంశీ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో బిజెపి మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పొంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, మర్రి మల్లేశం, మేడిశెట్టి శ్రీహరి, లోలపు శేఖర్, సిరికొండ తిరుపతి, హన్మయ్య చారి పాల్గొన్నారు.